‘నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి’


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

కాచిగూడ: నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, మళ్లీ ఎగ్జామ్ నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన రావాల్సిన నీట్ ఫలితాలను ఎన్నికల రిజల్ట్స్ రోజున హడావిడిగా విడుదల చేశారని ఆరోపించారు. నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 67 మంది ఫస్ట్ ర్యాంక్ సాధించారని, వారిలో మొత్తం 720 గాను 719, 718 మార్కులు సాధించారని, నీట్ చరిత్రలో ఇలాంటి ఫలితాలు ఎప్పుడు రాలేదన్నారు. అంతేగాకుండా ఒకే సెంటర్ నుంచి 8 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారని, ఎగ్జామ్ నిర్వహణలో జరిగిన లోపాలకు ఇదే నిదర్శనమన్నారు. టెక్నికల్ సమస్యల వలన పరీక్షను లేట్‌గా నిర్వహించి, నిర్ణత సమయంలోనే పరీక్ష ముగించారని, దీంతో సమయం కోల్పోయిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. హడావిడిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధిత విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలుపుతామని ప్రకటించారని, దీని వలన మెరిట్ స్టూడెంట్స్ తీవ్రంగా నష్టపోయారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పై సీబీఐ విచారణ జరిపించాలని లేకుంటే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఆందోళనలు చేపడుతామని చేస్తామని ఆయన హెచ్చరించారు.

అవయవదానంపై అవగాహన కల్పించాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కరాటే విద్యార్థులు

కాచిగూడ: అవయవ దానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి, నాయక్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ దామోదర్ నాయక్ అన్నారు. ఆయన సహకారంతో గ్లోబల్ ఈవెంట్స్, మోహన్ ఫౌండేషన్ సీనియర్ ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ భానుచంద్ర, బ్రిల్స్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో కాచిగూడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని కరాటే విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఏదో ఒకచోట అవయవాల కొరత వల్ల రోగులు మృతి చెందుతున్నారన్నారు. అవయవ దానం వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించి ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ బతికున్నప్పుడు రక్తదానం, చనిపోయిన తర్వాత అవయవదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ భానుచంద్ర, రాంనరేశ్, డాక్టర్ మార్త రమేశ్, లలిత, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలి


గంగపుత్ర కాలనీ వాలీబాల్ క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న గోరఖ్‌నాథ్, కాలనీ వాసులు

ముషీరాబాద్: క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరఖ్‌నాథ్ కోరారు. ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలోని జీహెచ్ఎంసీ వాలీబాల్ మైదానాన్ని కాలనీ వాసులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే గ్రౌండ్‌లో నీళ్లు నిలిచి బురదమగా మారడం వల్ల క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కావాల్సిన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర కాలనీ సొసైటీ నాయకులు రమాకాంత్, శ్రీనివాస్, జగదీష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు త్వరగా పూర్తిచేయాలి


కూచిపూడి వద్ద డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, ముఠా జైసింహ తదితరులు

కవాడిగూడ: డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ అన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి కవాడిగూడ డివిజన్ పూల్‌బాగ్ కూచిపూడి వద్ద జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ అధికారులు కార్తీక్‌రెడ్డి, శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేశ్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎ. ప్రభాకర్ గంగపుత్ర, బీఆర్ఎస్ నగర నాయకుడు కల్వగోపి, కవాడిగూడ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, బస్తీ అధ్యక్షుడు నాగరాజు, బీజేపీ నాయకుడు గద్దె శ్రీనివాస్, యువమోర్చా డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, నాయకులు జంగా శ్రీకాంత్, వాటర్‌వర్క్స్ సిబ్బంది కృష్ణ, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు సేఫ్టీ గ్రిల్స్‌తో చెక్

- మ్యాన్‌హోళ్లపై మూతలు తీస్తే కఠిన చర్యలు
- సమస్యలపై 15313కు ఫిర్యాదు చేయొచ్చు


భరత్‌నగర్‌లో మ్యాన్‌హోల్ లోపల సేఫ్టీ గ్రిల్స్ అమర్చుతున్న సిబ్బంది

రామంతాపూర్: ప్రతియేటా వర్షాకాలంలో భారీగా కురిసే వర్షాలకు బస్తీలు, కాలనీలోని ప్రధాన రహదారుల్లో వరద నీరు రోడ్లపై నిల్వకుండా ఉండేందుకు కొంతమంది అవగాహనరాహిత్యంతో మ్యాన్‌హోల్స్ మూతలను తెరిచి ఉంచుతున్నారు. దీంతో వర్షాలు కురిసిన సమయాల్లో మ్యాన్‌హోళ్లు పూర్తిగా నిండిపోవటంతో అక్కడ మ్యాన్‌హోల్ ఉన్న సంగతి గుర్తించకపోవటంతో పాదచారులు, వాహనదారులు మ్యాన్‌హోల్స్‌లో పడి గాయాలు కావటంతోపాటు కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం పోతున్నాయి. ఈ ప్రమాదాల నివారణకు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, హబ్సిగూడ, ఉప్పల్, చిలుకానగర్ డివిజన్‌లోని బస్తీల్లో కాలనీలో లోతైన ప్రమాదకరమైన మ్యాన్ హోళ్లను గుర్తించి వాటి లోపల జలమండలి అధికారులు సేఫ్టీ గ్రిల్స్‌ను ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. మ్యాన్‌హోల్స్‌లో బిగిస్తున్న సేఫ్టీ గ్రిల్స్ వల్ల పొరపాటు ఎవరైనా తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌లో పడితే స్వల్ప గాయాలు తప్ప ఎటువంటి ప్రమాదం జరగదని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. అనధికారింగా జలమండలి అనుమతి లేకుండా మ్యాన్‌హోల్‌పైన ఉండే మూతలను తొలగించడం తెరిచి ఉంచడం వంటి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటున్నారు జలమండలి అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూతలు తెరిచి ఉండటం లేదా మూతలు పక్కన పెట్టి ఉండటం వంటి సంఘటనలకు గమనిస్తే జలమండలి కస్టమర్ కేర్ 15313 నెంబర్‌కు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు.

సమస్యల వలయంలో సర్కారు బడులు!

- ఇంకా పూర్తి కాని అభివృద్ధి పనులు
- రేపే పునఃప్రారంభం
- కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత
- కానరాని మౌలిక వసతులు

సికింద్రాబాద్ ప్రాంతంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు ఇంకా సమస్యల వలయంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలోనూ లాలాపేట, తార్నాక, అడ్డగుట్ట ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు నేటికీ అందుబాటులోకి రాలేదు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా ఇప్పటికే చేపట్టిన పలు అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు టాయిలెట్లు అందుబాటులోకి రాలేదు, దాదాపు అన్ని పాఠశాలల్లో డ్రైనేజీ లైన్ల నిర్మాణం, తాగునీటి వసతి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. తరగతి గదుల మరమ్మతు, విద్యుత్ సరఫరా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. –సికింద్రాబాద్/అడ్డగుట్ట/లాలాపేట

500 మంది విద్యార్థులు..5 మంది టీచర్లు

సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని ఏడాది క్రితం నేలమట్టం చేశారు. అధునాతన భవనం నిర్మాణం పేరిట ఇక్కడి పాఠశాల భవనాన్ని నేలమట్టం చేసినా కొత్త భవనం నిర్మాణం పనులు బేస్‌మెంట్ తోనే ఆగిపోయాయి. ఈ పాఠశాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలోని ఓయూ మోడల్ స్కూల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రెండు పాఠశాలల తరగతులు ఒకే భవనంలో కొనసాగుతుండడం విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. మనబడి పథకం కింద ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్లు డ్రైనేజీ లైన్ల నిర్మాణ పనులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడి పాఠశాల భవనం చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మాణం కూడా చేయిస్తున్నారు. మారేడుపల్లి మండల కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లాలాగూడ నెం. 1 పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. సుమారు 500 మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలో కేవలం ఐదుగురు మాత్రమే టీచర్లు ఉన్నారు.



ఏసీఎస్ నగర్‌లోని పాఠశాలలో కొనసాగుతున్న టాయిలెట్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు

రెండు వారాల్లో పనులు పూర్తి: డిప్యూటీ డీఈఓ

పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సోమవారం మారేడుపల్లి జోన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ బాలునాయక్ లాలాపేట గడి స్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారేడుపల్లి మండలం పరిధిలో మొత్తం 15 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని ఇందులో మన బస్తీ మన బడి పథకం కింద కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల వసతుల కోసం అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. కొన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు తుదిదశకు చేరాయని, ఇంకొన్ని పాఠశాలల్లో మరో రెండు వారాల్లో పనులు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. మండలంలో ప్రస్తుత విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు ఉన్నారని ఆయన వెల్లడించారు.

ఎంఎంటీఎస్ రైలు నుంచి పడి విద్యార్థి మృతి

కాచిగూడ: ఎంఎంటీఎస్ రైలు నుండి పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం .. బోయిగూడకు చెందిన జయసూర్య (20) డిగ్రీ పూర్తి చేశాడు. స్నేహితులతో కలిసి ఫలక్‌నుమాలో ఉన్న శ్రీకాళీమాతా అమ్మవారిని దర్శించుకుని తిరిగి సికింద్రాబాద్ వెళ్లేందుకు ఎంఎంటీఎస్ రైలు ఎక్కాడు. యాకత్‌పురా రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే ఫుట్‌బోర్డుపై ఉండగా ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యావంతులతోనే సమాజాభివృద్ధి

రామంతాపూర్: సమాజంలో విద్యావంతులు అధిక సంఖ్యలో ఉంటారో అక్కడ సమాజాభివృద్ధితోపాటు దేశం అన్ని రంగాల్లో రాణిస్తుందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం రామంతాపూర్ భరత్‌నగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్ నూతన భవన సముదాయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధునిక భవన సముదాయాన్ని నిర్మించినందుకు ఆయన స్కూల్ అధినేత సూరం రామ్‌రెడ్డిని అభినందించారు. సీబీఎస్ఈ సిలబస్‌ను కూడా ఇవి స్కూల్‌లో ప్రారంభించి అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణితో పాటు స్కూల్ ప్రిన్సిపాల్ మమతారెడ్డి, చుక్కంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై బీఆర్ఎస్వీ మండిపాటు

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ అవకతవకలపై బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య సోమవారం మండిపడ్డారు. వ్యయప్రయాసాలకు ఓర్చి తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులు కష్టపడి చదివి నీట్ పరీక్ష రాస్తే అందులో అక్రమాలు జరగడం దుర్మార్గమన్నారు. ప్రవేశ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి బాధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరగాలంటే మళ్లీ నీట్ పరీక్షను నిర్వహించాలన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల అందజేత

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంధ్రా విద్యాలయ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు సోమవారం సాయంత్రం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు ఎంతోకొంత సహాయం చేయాలనే ఉద్దేశంతో డి.స్వాతి, డి.నాగశ్రీ, సీహెచ్ స్వాతికి నగదు బహుమతులు అందించామని యేటా కూడా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు రుద్రోజు వేణుగోపాలాచారి, సీసీ ప్రవీణ్, రమేశ్, నర్సింహ, వేణు, రామకృష్ణ, మోహన్‌రావు, శ్రీనివాస్, సురేశ్, సుబ్బు, సాంబశివరావు, రజనీకాంత్, చంద్రశేఖర్, అబ్బాస్, శ్రీను, రమణ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులను ట్రైనింగ్‌కు పంపించాలి


కానిస్టేబుల్ అభ్యర్థులతో నీలం వెంకటేశ్

కాచిగూడ: 2022 సంవత్సరంలో ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులను వెంటనే ట్రైనింగ్‌కు పంపించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేశ్ కోరారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయంలో ట్రైనింగ్ ఐజీ అభిలాష బిస్త్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఆర్ 31 మంది, సివిల్ 34 మంది మొత్తం 65 మందిని ట్రైనింగ్‌కు పంపించేందుకు స్థలం లేక ఆర్‌పీఎఫ్ గ్రౌండ్‌ను హైర్ కోసం మాట్లాడారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు నిధులు విడుదల చేయాలని కోరారు. లేకుంటే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా వైఎంసీఏ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్లు భాస్కర్, జోనతన్ ధర్మరాజు తదితరులు

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నారాయణగూడలోని వైఎంసీఏ క్రీడా మైదానంలో వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ పి.జోనతన్ ధర్మరాజ్ అధ్యక్షత వహించారు. వైఎంసీఏ స్ఫూర్తితో సర్ జార్జ్ విలియమ్స్, వ్యవస్థాపక సభ్యులందరిని వేడుకల్లో పాల్గొన్న వారందరూ కృతజ్ఞతతో గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎస్ఐ వెస్లీ చర్చ్ రాంకోఠి రెవరెండ్ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ మనల్ని మనం పునరంకితం చేసుకోవడంతో పాటు సేవా కార్యక్రమాలు కూడా చేపట్టాలన్నారు. వైఎంసీఏలో 40 ఏళ్లు పూర్తి చేసి పదవి విరమణ చేసిన బి.వసంత్ కుమార్, సీనియర్ మెంబర్ ప్రభాకర్ సిగమోని, అడ్వొకేట్ ఎస్.జే.ఏ. నదీమ్‌ను ఈ సందర్భంగా అభినందించి సత్కరించారు. అలాగే వైఎంసీఏకు నిస్వార్థంగా సహకారాన్ని అందిస్తున్న వైఎంసీఏ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను అభినందించారు. కార్యక్రమంలో వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ప్రిస్టిలీ గైస్, బిజె వినయ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


51 వెరైటీలతో మహిళలు తయారు చేసిన హర్బల్ చాయ్

కాచిగూడ: మహిళలు ఇంటికి మాత్రమే పరిమితం కాకుండా అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని భావసార్ రంగ్రేజ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మీసూత్రవే అన్నారు. బర్కత్‌పురలో అనిల్ ఎస్.లోఖండే, అరుణ్ జ్యోతి ఎస్.లోఖండే ఆధ్వర్యంలో 51 వెరైటీల ‘హర్బల్ చాయ్’ల తయారీపై సోమవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యానికి మెచ్చని హర్బల్ పానీయాలు సేవించాలని, ఇండ్లలోనే తయారు చేసుకుని తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సంగీత పటాలే, కరుణ సూత్రవే, పరిణీత సూత్రవే, అనుపమ ఆస్తేకర్, సెజల్ లోఖండే పాల్గొన్నారు.

పార్టీలో పనిచేసేవారికే గుర్తింపు


శ్రీనివాస్‌గుప్తాను సన్మానిస్తున్న ముఠా జైసింహ, రాకేశ్

చిక్కడపల్లి: పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ అన్నారు. గాంధీనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తాను సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, నాయకులు శ్రీకాంత్, జీవై గిరి, రవిశంకర్‌గుప్తా, బి.కిరణ్, ఎంబి కృష్ణ, కుమారస్వామి, రచ్చ నరేశ్, సాయిచాణిక్యరెడ్డి పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్య ప్రకాశ్ సింగ్, ఎన్.గౌతంరావు, ఎక్కాల కన్నా, ఎక్కాల నందు


బీజేవైఎం హైదరాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి యశ్వంత్

కాచిగూడ: కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కోశాధికారి ఎ.సూర్యప్రకాశ్ సింగ్ సోమవారం ఢిల్లీలో కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కాచిగూడకు చెందిన పలువురు నేతలు ఎక్కాల కన్నా, ఎక్కాల నందు, అంబర్‌పేటకు చెందిన యశ్వంత్, ఖైరతాబాద్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్ తదితరులు కూడా కలిసి సత్కరించి విశేష్ చెప్పారు. కిషన్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌కి..


శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ కార్పొరేటర్ రమేశ్

నల్లకుంట: కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌ని ఆ పార్టీ నాయకులు సోమవారం ఢిల్లీలో కలిశారు. నల్లకుంట మాజీ కార్పొరేటర్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు వనం రమేశ్ సంజయ్‌కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన విద్యాసాగర్



కాచిగూడ: బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల విద్యాసాగర్ తన బర్త్‌డే సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌ను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ విద్యాసాగర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలువురు విద్యార్థి సంఘం నేతలు కూడా విద్యాసాగర్‌ను కలిసి విషేశ్ చెప్పారు. అలాగే కాచిగూడలోని ఆసుపత్రుల్లో పండ్లు పంపిణీ చేయగా కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద వృద్ధులు, భిక్షాటన చేసుకునే వారికి అన్నదానం చేశారు. అలాగే చలికి తట్టుకునేలా బట్టలు, రగ్గులు అందజేశారు.

బీజేపీ నాయకుల సంబురాలు


చెప్పల్‌బజార్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న వినోద్ యాదవ్

కాచిగూడ: ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంపై కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాచిగూడ, చెప్పల్ బజార్‌లో నేతలు, కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేసి పటాకులు కాల్చారు. మోదీ కేబినెట్‌లో 27 మంది బీసీలకు స్థానం కల్పించడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు అచ్చిని రమేశ్, ఎంబీ కిశోర్ కుమార్, రవీందర్, ఆనందాస్, మధు, యాదగిరి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఉప్పల్ : వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సూచించారు. ఈ మేరకు సోమవారం వార్డు కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి వర్షాకాలంలో వచ్చే సమస్యలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వరద నీరు నిలిచే ప్రాంతాలు, నాలాల పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విరిగిన విద్యుత్ పోల్స్‌ను తొలగించాలని, తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, జీహెచ్ఎంసి ఎఈ రాజ్‌కుమార్, జలమండలి డిజిఎం రజినికాంత్ రెడ్డి, ఉప్పల్ డిఈ చందన, సానిటరీ సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో యోగా దినోత్సవం

ఉప్పల్ : ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా శిక్షకులు కరుణాకర్‌రావు అన్నారు. సోమవారం ఉప్పల్ లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా సాధికారిత యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు కరుణాకర్‌రావు ఉపాధ్యాయులు, విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తూ దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోసఫ్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా ప్రధాన పాత్ర అని ప్రతి నిత్యం యోగాను అభ్యాసం చేయాలని సూచించారు. మానసిక, శారీరక వికాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఒకప్పుడు యోగాపై ఎవరికి అవగాహన ఉండేది కాదని కానీ ఇప్పుడు యోగా విశిష్టతను తెలుసుకొని ప్రపంచస్థాయిలో అధికారులు యోగాను చేస్తున్నారన్నారు.